## క్లుప్తంగా

### వరసిద్ధుని సేవలో జెడ్పీ చైర్మన్



జెడ్పీ చైర్మన్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

**కాణిపాకం(యాదమరి):** కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆయన కాణిపాకం విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

**శ్రీవారి సేవలో..**

**చిత్తూరు కార్పొరేషన్:** తిరుమలోని శ్రీవారిని శనివారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వేద పండితులు స్వామి దర్శనభాగ్యం కల్పించి ఆశ్వీరచనాలు అందించారు.

### ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

**బంగారుపాళెం:** మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్‌నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### విద్యతోనే ఉజ్వల భవిష్యత్



భార్గవరెడ్డిని సన్మానిస్తున్న డీఈఓ

**చిత్తూరు రూరల్:** విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. చిత్తూరు నగరం రెవెన్యూ భవనంలో శనివారం ప్రజాహిత సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభకు పట్టం అనే కార్యక్రమానికి నిర్వహించారు. సత్యసాయి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచి రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్న భార్గవ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కాళ్లు చేతులు కదపకుండా 5 గంటల పాటు నీటిలో తేలియాడి గిన్నిస్ రికార్డుకెక్కిన వైషాక్, రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్న నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు కరణం విమలను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సెల్వరాజ్, సంస్థ అధ్యక్షుడు రాజరత్నం రెడ్డి, దాత పార్థసారథినాయుడు పాల్గొన్నారు.

### అవినీతిలో కూరుకుపోయిన కాంగ్రెస్

**చిత్తూరు కార్పొరేషన్:** కాంగ్రెస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు ఆరోపించారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. అవినీతి ఆరోపణలపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ సభ్యురాలు మహువా మొయిత్రాపై శుక్రవారం బహిష్కరణ వేటు పడిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, మాజీ ఎంపీ దుర్గ, నాయకులు శ్రీనివాసులు, రామభద్ర, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

### జ్వరం, జలుబుతో ఓపీ కిటకిట



క్యూ కట్టిన జ్వరబాధితులు

**చిత్తూరు రూరల్:** నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం జ్వరం, జలుబు, దగ్గు బాధితులతో ఓపీ కిటకిటలాడింది. ఈ రకమైన సమస్యలకు సంబంధించి 150కి బాధితులు వచ్చారు. దీంతో ఆస్పత్రి ఆవరణ మధ్యాహ్నం 12 గంటల వరకు రద్దీగా కనిపించింది. వైద్యులు చికిత్స చేసి తగిన సూచనలు, సలహాలు అందించారు. వైరల్ ఫీవర్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించారు.

### 11న కార్తీక దీపారాధన

**పుంగనూరు:** పట్టణంలోని అన్నపూర్ణ కాశీవిశేశ్వర స్వామి ఆలయ పుష్కరిణిలో సోమవారం రాత్రి ఆధ్వర్యంలో కార్తీక దీపారాధన నిర్వహించనున్నట్టు హిందూ జాగరణ సమితి ప్రతినిధులు త్రిమూర్తిరెడ్డి, పరమేష్ తెలిపారు. వారు శనివారం సాయంత్రం పుష్కరణి మెట్లను నీటితో శుభ్రం చేసి, పసుపు, కుంకుమ పెట్టే ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జాగరణ సమితి ప్రతినిధులు గంగాధర్, హరి, నాగరాజ, సురేష్, వెంకటేష్, చంద్ర, సునీల్, రాజేష్, మధు, భార్గవ్ పాల్గొన్నారు.

---

- వేడుకలకు ముస్తాబవుతున్న చర్చిలు
- అలంకరణ సామగ్రితో దుకాణాలు కళకళ
- ఆకట్టుకుంటున్న అలంకరణలు

నగరంలో ఈ సారి పక్షం రోజుల ముందే క్రిస్మస్ సందడి మొదలైంది. ఈ నెల 25న నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ఇప్పుడే ముస్తాబు కావడం విశేషం. సత్యం, శాంతి, త్యాగం, కరుణ, దయ, ప్రేమ, నిరీక్షణ అనే సందేశంతో ఏసుక్రీస్తు ఈ లోకానికి కొత్త మార్గాన్ని చూపారు. లోక రక్షకుడిగా పేరొందిన ఏసు జననం లోకానికి పర్వదినం. శాంతి, త్యాగానికి ప్రతీకగా నిలుస్తున్న క్రిస్మస్ పండుగ నిర్వహణకు క్రైస్తవులు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే నగరాల్లోని దుకాణాల్లో క్రిస్మస్ సామగ్రి విక్రయాలు ఊపందుకున్నాయి.



చిత్తూరు చర్చిలో విద్యుత్ దీపాల అలంకరణ

# పక్షం ముందే క్రిస్మస్ సందడి

**చిత్తూరు రూరల్:** చిత్తూరు నగరం, మండల ప్రాంతాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. పలు సంఘాలకు సంబంధించిన 50 చర్చిలు, చాపెల్స్ ఉన్నాయి. ఈచర్చిల్లో క్రిస్మస్ వేడుకల మొదలయ్యాయి. ఊరూ వాడా క్రైస్తవులు పండగ ఏర్పాట్లకు సిద్ధమవుతోంది. మందిరాల ముస్తాబుకు శ్రీకారం చుట్టారు. అప్పుడే పలు చర్చిలు విద్యుత్‌దీపాలంకరణలతో కాంతులీనుతున్నాయి. పశువుల పాకల ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయి. చర్చి ఆవరణం, లోపలిభాగంలో ప్రత్యేక డెకరేషన్ కోసం నిర్వాహకులు భారీగా ఖర్చు చేస్తున్నారు.

**ప్రారంభమైన వేడుకలు**

ఇప్పటికే కొన్ని చోట్ల యూత్ క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెలంతా క్రిస్మస్ వేడుకల్లో భాగంగా నాటికలు, క్యాండిల్ సర్వీస్ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. క్రీస్తు పుట్టుకను వివరిస్తూ పశువుల పాకలను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద క్రిస్మస్ స్టార్, క్రిస్మస్ ట్రీ, క్రిస్మస్ తాత, క్రిస్మస్ గంటలు, కొవ్వొత్తుల వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేస్తున్నారు. ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని మననం చేసుకుంటూ క్రైస్తవులు గ్రామాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ, గీతాలను ఆలపిస్తూ పలు చర్చిల్లో కేక్ కటింగ్‌లు చేస్తున్నారు. మరి కొన్ని చోట్ల పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

**గృహాల్లో క్రిస్మస్ స్టార్**

ఈ నెల 25న క్రిస్మస్‌ను పురస్కరించుకుని క్రైస్తవులు ఇళ్లను, చర్చిలను అలంకరించే పనిలో మునిగిపోయారు. క్రిస్మస్ ట్రీలు, వెలుగులు విరజిమ్మే నక్షత్రాలతో, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల ప్రధాన కూడళ్లలో క్రిస్మస్ నక్షత్రాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లోని చర్చిలకు రంగులు వేసి విద్యుత్ దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

**సెమీ క్రిస్మస్**

క్రిస్మస్ సంబరాల్లో భాగంగా ఈ నెల 1 నుంచి గ్రామాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నారు. చర్చిల్లో క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపే నాటికలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆరంభమయ్యాయి. క్రిస్మస్ ప్రత్యేక గీతాలను ఆలపించడంతో పాటు బాణసంచాతో సందడి చేస్తున్నారు. పేదలకు దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు.



విక్రయానికి క్రిస్మస్ తాత బొమ్మలు



క్రిస్మస్ వేడుకలకు అలంకరణ సామగ్రి



క్రిస్మస్ అలంకరణలు విక్రయించే దుకాణం



చిత్తూరు నగరంలో విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబైన చర్చి



క్రిస్మస్ వేడుకల్లో నృత్య ప్రదర్శనకు శిక్షణ పొందుతున్న చిన్నారులు



దుకాణాల్లో అలంకరణ సామగ్రి విక్రయాలు

---

## కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

**తవణంపల్లె:** కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. మండలంలోని చారాల, కారకాంపల్లె గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని ప్రజలు, అధికారులు ఆలకించారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ పథకాలను ప్రజలు తెలుసుకొని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ధాత్రేయచౌదరి, వినయ్‌కుమార్, ఐసీడీఎస్ ఐరాల సీడీపీఓ నిర్మల, వ్యవసాయాధి కారి ప్రవీణ్, మండల వ్యవసాయ మండలి చైర్మన్ పూర్ణచంద్రారెడ్డి, సర్పంచ్ మల్లుదొరై, ఈఓపీఆర్‌డి కుమార్, బీజేపీ జిల్లా నాయకులు జగదీష్‌నాయుడు, కె.వి. చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్ సీఆర్ రెడ్డి పోటీలకు విశేష స్పందన



వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**చిత్తూరు కలెక్టరేట్:** నగరంలోని సంసిద్ధి క్యాంఫోర్డ్ పాఠశాలలో శనివారం నిర్వహించిన డాక్టర్ సీఆర్. రెడ్డి పోటీలకు విశేష స్పందన లభించింది. డాక్టర్.కట్టమంచి రామలింగారెడ్డి 144వ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన పలువురు విద్యార్థులకు గురజాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భారతి, తల్లిదండ్రులు, విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

## పార్వేట మండపంలో కార్తీక వనభోజనాలు

**చంద్రగిరి:** పవిత్ర కార్తీకమాసం సందర్భంగా శనివారం శ్రీవారి మెట్టు వద్ద గల పార్వేట మండపంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని టీటీడీ అధికారులు వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవర్లను ఊరేగింపుగా పార్వేట మండపానికి తీసుకొచ్చారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని అర్చకులు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించారు. అనంతరం పార్వేట మండపంలో మధ్యాహ్నం 12 నుండి 3 గంటల వరకు కార్తీక వనభోజనోత్సవం జరిగింది. కార్తీక వనభోజనం మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నారాయణాచార్యులు, ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఆలయ ప్రత్యేక అధికారి, టీటీడీ పీఆర్‌ఓ డాక్టర్ టి.రవి, వీజీవో బాలిరెడ్డి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్లు చెంగల్‌రాయులు, వెంకట స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

### లోక్ అదాలత్‌లో 11 కేసుల పరిష్కారం

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు రూరల్ ఎస్ఈబీ పరిధిలో నమోదైన 44 కేసులను శనివారం జరిగిన లోక్‌అదాలత్‌లో పరిష్కరించినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ నేపథ్యంలో 44 మంది రూ. 2,84,440 జరిమానా ప్రభుత్వానికి చెల్లించారని ఆయన పేర్కొన్నారు.

**రాజీ అంటే ఇరుపార్టీలు గెలిచినట్టే**

**పలమనేరు:** కేసుల్లో రాజీకి పోవడం అంటే ఒకరు గెలిచి, మరొకరు ఓడినట్టు కాదని, ఇరువురూ గెలిచినట్టేనని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్ కేసులను పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ త్వరితగతిన కేసుల పరిష్కారం కోసం అత్యున్నత న్యాయస్థానం రాజీమార్గాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఇది కక్షిదారులకు ఎంతో ఉపయుక్తంగా మారిందన్నారు. కేసుల రాజీతో కక్షిదారుల కుటుంబాల్లో వెలుగులు విరజిమ్ముతాయని చెప్పారు. పలమనేరులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో రూ.76.69 లక్షల విలువైన 450 కేసులు పరిష్కారమైనట్టు తెలిపారు.

### 564 కేసుల పరిష్కారం

**నగరి:** స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 564 కేసులు పరిష్కారమయ్యాయి. జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో సివిల్ మనీ కేసులు 3, సివిల్ టైటిల్ 3, ఐపీసీ కేసులు 14, ఎంసీ కేసులు 03, డీఈసీ ఒకటి, ఎస్‌టీసీ 1, సీసీ 498ఏ కేసులు 7, ఎన్‌ఐ యాక్ట్ 4, ఎస్ఈబీ 18, బ్యాంకు కేసులు 48, సెకండ్ క్లాస్ కేసులు 294, అడ్మిషన్ కేసులు 6 పరిష్కారమయ్యాయి. రూ.1.39 కోట్లు రికవరీ అయ్యింది. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

### అర్ధగిరిలో హుండీ కానుకల లెక్కింపు రేపు

**తవణంపల్లె:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 11వ తేదీన సోమవారం ఉదయం హుండీ కానుకల లెక్కింపు ఉంటుందని ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. హుండీ కానుకల లెక్కింపు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో జరుగుతుందని వివరించారు.

## ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు

**ఐరాల:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నాదే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 92 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక, ఆరోగ్య శ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేసుకున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

## బాల్య వివాహాలు అరికట్టాలి



డ్వాక్రా మహిళల మానవహారం

**పాలసముద్రం:** బాల్యవివాహాలను అరికట్టాలని ఐకేపీ ఏపీఎం పరిదుమస్తాన్ తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు బాల్య వివాహాలు, గృహహింస అరికట్టడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ లింగ వివక్ష నేరమని, బాల్యవివాహాలు చేయరాదని సూచించారు. ప్రతి మహిళా విద్యావేత్తగా ఎదగాలని ప్రతిజ్ఞ చేయించారు. రక్త హీనతను వివరించారు. అనంతరం డ్వాక్రా మహిళలు మానవహారం నిర్వహించారు.

### అన్నదానం

**కార్వేటినగరం:** స్థానిక రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కార్వేటినగరం వాసి ఎన్ఆర్ఈజీఎస్ జేఈ కిషోర్‌కుమార్ కుటుంబసభ్యులు శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి భక్తుడు ముందుకొచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శుక్రవారం, శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకొని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు.

### పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి

**పలమనేరు:** పిల్లలకు విద్యతో పాటు నైతిక విలువలు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని శతావధాని ఆముదాల మురళి తెలిపారు. స్థానిక కళామందిరంలో శనివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి పదకొండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విలువలను నేర్పే నీతి పద్యాలను పిల్లలతో కంఠస్థం చేయించాలన్నారు. గార్లపాటి దామోదర్‌నాయుడు మాట్లాడుతూ తెలుగు కోసం దశాబ్దకాలంగా కృషిచేస్తున్న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సేవలను కొనియాడారు. అనంతరం భాషా పోటీల్లో గెలుపొందిన 60 మంది పిల్లలకు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప పుస్తకాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం వార్షికోత్సవ పురస్కారాలను బ్రహ్మానందరెడ్డి, రఘుపతి రామస్వామి, మునిరెడ్డి, కీర్తి, మురళీధరరాజు, నగేష్, కవిత, మధుమోహన్, ఆనంద్‌నాయుడు, మొగిలయ్యశెట్టి, రెడ్డెమ్మ, వేలాయుధంకు అందజేశారు.



బహుమతులందుకున్న చిన్నారులతో నిర్వాహకులు

## బాధితులకు అండగా ప్రభుత్వం



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

**పుత్తూరు:** మిచాంగ్ తుపాన్ బాధితులకు నేటి జగనన్న ప్రభుత్వం అండగా నిలిచిందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థాని క తహసీల్దార్ కార్యాలయం వద్ద పుత్తూరు పట్టణ, రూరల్ పరిధిలోని 234 తుపాన్ బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులను ఆయన పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో వంతున కందిపప్పు, ఎర్రగడ్డ, ఉర్లగడ్డ, లీటరు నూనె అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తుపాన్ బాధితులకు సాయం అందించారన్నారు. వర్ష బీభత్సానికి దెబ్బతిన్న రోడ్లు, కాల్వలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. తక్షణ సాయంగా రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వర్ష బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందజేసినట్లు చెప్పారు. దెబ్బతిన్న ఇళ్లు, పంటలను అధికారులు నష్టం అంచనా వేస్తున్నారని, అందరిని అన్ని విధాల ఆదుకుంటామని పేర్కొన్నారు. తహసీల్దార్ జె.పరమేశ్వర స్వామి, మున్సిపల్ చైర్మన్ ఎ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, ఎంఎల్ఓ దిలీప్, కౌన్సిలర్లు హేమలత, జయలక్ష్మి, బాలాజి, చిట్టిబాబు, జాన్ కెనడీ, గుణ పాల్గొన్నారు.